క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్రీగిరి గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో నృత్యార్చన చేస్తున్న చిన్నారి రాధా రమణి

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒంగోలు శ్రీ బాపూజీ గో సంరక్షణశాల వద్ద ముందుగా గోపూజ చేశారు. మహిళలు గోవింద నామస్మరణ చేస్తూ పాల్గొన్నారు. చిన్నారి రాధా రమణి గంధవళ్ల తన కూచిపూడి నృత్యంతో శ్రీవారికి నృత్య అర్చన చేసి భక్తులను అలరించింది. గిరి ప్రదక్షిణ కమిటీ అధ్యక్షుడు రాధా రమణ గుప్తా జంధ్యం, కోశాధికారి ఓలేటి కృష్ణారావు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఓనం వేడుకలు



ఓనం వేడుకల్లో పాల్గొన్న డాక్టర్లు

ఒంగోలు మెట్రో: కేరళ ప్రజల అతి ముఖ్యమైన పండుగ ఓనం సందర్భంగా ఒంగోలు సంతపేటలోని రాఘవాచారి హాస్పిటల్ దగ్గర కేరళ ఆయుర్వేద వైద్యశాల ఆవరణలో డాక్టర్ల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం వేడుకలు నిర్వహించారు. కేరళ సంస్కృతి, సంప్రదాయాలతో పండుగ జరుపుకున్నారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ

ఒంగోలు వన్‌టౌన్: మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా స్థానిక బొమ్మరిల్లు అనాథాశ్రమంలో విద్యార్థులకు దోస్తీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎస్‌కే మహబూబ్ మాట్లాడుతూ హజ్రత్ మహ్మద్ ప్రవక్త బోధించిన నీతి, నిజాయితీ, కరుణ, సమానత్వం, విలువలను ప్రతిఒక్కరూ ఆచరించాలని కోరారు. కార్యక్రమంలో బొమ్మరిల్లు నిర్వాహకులు ఎస్‌కే ఖాసీం, మార్నెళ్ల సుబ్బారావు, నత్తల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న రెడ్డి జనాభ్యుదయ సంఘం నాయకులు



శర్మ కాలేజీలో అధ్యాపకులను సత్కరిస్తున్న విద్యార్థులు

ఉపాధ్యాయుల పాత్ర గురుతరమైనది

- ఎస్‌బీఐ ఆర్ఎం శ్రీనివాసరావు
- ఘనంగా గురుపూజోత్సవం

ఒంగోలు సబర్బన్: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గురుతరమైనదని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రకాశం జిల్లా రీజినల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు అన్నారు. ఒంగోలులోని బ్యాంక్ రీజినల్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని 50 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు మార్గనిర్దేశకులని అన్నారు. మన సమాజంలో గురువు పాత్ర ఎంతో కీలకమైందన్నారు. అటువంటి గురువులను సన్మానించుకోవడం మన బాధ్యతని అన్నారు. డీఈఓ కిరణ్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తు మార్గనిర్దేశకులను తయారు చేసే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. నేటి సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ వృత్తి నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలన్నారు. ప్రతి ఏటా ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఉపాధ్యాయులను సన్మానిస్తున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి డి.చంద్రమౌళీశ్వరరావు, రీజినల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్లు వేదం రాజేష్ బాబు, హారతి, రవికుమార్, హెచ్ఆర్ మేనేజర్ జె.ఎస్.వి.ఎస్.నళినీకాంత్, కె.జానకిరామయ్య, ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ డిప్యూటీ రీజినల్ సెక్రటరీ వేమజాల శ్రీనివాసరావు, ఎస్‌బీఐ ఓఏ జోనల్ సెక్రటరీ సీహెచ్ శ్రీనివాసరావు, ఒంగోలు, టంగుటూరు ఎంఈఓలు టి.కిషోర్ బాబు, తన్నీరు బాలాజీ, ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌బీఐ జిల్లా రీజినల్ మేనేజర్ శ్రీనివాసరావు

రెడ్డి జనాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో...

ఒంగోలు వన్‌టౌన్: ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను రెడ్డి జనాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలు మామిడిపాలెంలోని రెడ్డి హాస్టల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కేవీ రమణారెడ్డి, తదితరులు పాల్గొని హాస్టల్ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

యువతకు ఆదర్శం.. సర్వేపల్లి

ఒంగోలు మెట్రో: ప్రపంచ ప్రఖ్యాత తత్వ శాస్త్రవేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ స్ఫూర్తితో విద్యార్థులు జీవితంలో ఘన విజయాలు సాధించాలని స్థానిక సీఎస్ఆర్ శర్మ కళాశాల ప్రిన్సిపాల్ ఎం, శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సర్వేపల్లి ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన అనంతరం దేశానికి రాష్ట్రపతిగా విశిష్ట సేవలందించారని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులంతా ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుతో పాటు అధ్యాపకులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. శర్మ కళాశాల ఇంగ్లిష్ లెక్చరర్ గాయత్రి సంచాలకత్వం వహించారు.

గద్దలగుంటలో...

ఒంగోలు గద్దలగుంట మూడు బొమ్మల వద్ద గల ఏసీ కమ్యూనిటీ హాల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు కనకారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి స్వీట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులంతా ఉపాధ్యాయుల ఆశీస్సులు అందుకున్నారు. చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు ఉచితంగా అందజేశారు.

బధిరుల పాఠశాలలో...

చీమకుర్తి: చీమకుర్తిలోని ఎస్‌కేఆర్ బధిరుల పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ బీ జవహర్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ అంజిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో నూనె హేమసుందర్, చలువాది రమేష్, స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గద్దలగుంటలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు



చీమకుర్తిలోని బధిరుల పాఠశాలలో సర్వేపల్లికి నివాళులర్పిస్తున్న డాక్టర్ జవహర్

రైతులను భయపెట్టడం మంచిది కాదు



సమావేశంలో మాట్లాడుతున్న మేరుగు నాగార్జున

- పోలీసులపై వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున ఆగ్రహం

నాగులుప్పలపాడు: అవగాహనా కార్యక్రమాల పేరుతో రైతులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బెదిరించడం పోలీసులకు ఏమాత్రం సమంజసం కాదని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున అన్నారు. గురువారం నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్‌లో ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ ఎరువుల కొరతతో పాటు పలు అంశాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి పాల్గొన్న వారిని బెదిరించి భయపెట్టేలా మాట్లాడారు. ఈ ఘటనపై శుక్రవారం మేరుగు నాగార్జున రైతు సంఘ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఎరువుల కొరతతో పాటు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. గతేడాది పండించిన పంట ఎలా అమ్ముకోవాలో తెలియని అయోమయస్థితిలో రైతులుంటే.. అవగాహన కార్యక్రమాల పేరుతో రైతులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి పోలీసులు భయపెట్టడం మంచిది కాదన్నారు. చేతగాని కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలు తీర్చక పోగా నేరుగా పోలీసులను రంగంలోకి దించి రైతులను బెదిరించడం మంచిది కాదన్నారు. ఒంగోలు రూరల్ సీఐ ప్రభుత్వాలకు తొత్తుగా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. పోలీసుల బెదిరింపులకు అండగా వ్యవసాయ శాఖ అధికారులు కూడా ఇలాంటి సమావేశాల్లో పాల్గొనడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ఈ గుడ్డి ప్రభుత్వం రైతాంగ సమస్యలు తీర్చడానికి కృషి చేయాలని మేరుగు నాగార్జున హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మారెళ్ల బంగారు బాబు, ఎస్సీ సెల్ స్టేట్ కన్వీనర్ కొమ్మూరి కనకారావు, రాష్ట్ర నాయకుడు నలమలపు కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, తగిరిశ సుబ్బారావు, అక్కి సాంబయ్య, యడవల్లి మోహనరావు, గండు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్ లేని గ్రామాలను తీర్చిదిద్దాలి

కొత్తపట్నం: హెచ్ఐవీ, ఎయిడ్స్ లేని గ్రామాలను తీర్చిదిద్దాలని గ్రో ఆర్గనైజేషన్ సీసీ ప్రాజెక్ట్ మేనేజర్ ఆర్.భవానీ పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో శుక్రవారం గ్రో ఆర్గనైజేషన్ సీసీ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఐఈసీ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా రాజుపాలెం గ్రామంలో విలేజ్ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ లీడర్స్, కమ్యూనిటీ లీడర్స్, గోదావరి వీవోలోని సెల్ఫ్ గ్రూపు డ్వాక్రా సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. అంబేడ్కర్ సామాజిక భవనంలో, గమళ్లపాలెంలో డోర్ టూ డోర్ ఐఈసీ క్యాంపెయిన్ నిర్వహించారు. సూర్య చంద్ర పొదుపు, చైతన్య పొదుపు గ్రూపు లీడర్లతో ఐఈసీ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి కారకాలు ఎలా వ్యాప్తిచెందుతాయి, హెచ్ఐవీ లక్షణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ యాక్ట్ 2017 ఏఆర్‌టీ మందులు, ఏపీఎస్ఏసీఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1097 గురించి తెలియజేశారు. కార్యక్రమంలో డ్వాక్రా గ్రూపుల లీడర్లు సరిత, మంగమ్మ, ఏ పద్మ, ఎం.వెంకట్రావు, ఎస్‌కే బ్రాహ్మణి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న భవాని



ఉప్పుగుండూరులో గణపతి నిమజ్జనంలో పాల్గొని వినాయకుడి రథం తోలుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున



సంతనూతలపాడు రెడ్డిబజార్‌లో వినాయకునికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, స్థానికులు

వైభవంగా గణపతి నవరాత్రులు

- ఉప్పుగుండూరులో నిమజ్జనంలో పాల్గొని పూజలు చేసిన మాజీ మంత్రి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: గణపతి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. పలుచోట్ల పూజలందుకున్న గణనాథులను నిమజ్జనాలకు తరలిస్తున్నారు. అందులో భాగంగా ఉప్పుగుండూరులో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మద్దిసాని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పూజలు చేసి నిమజ్జనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి స్వామివారికి తొలి హారతి అందించారు. అదేవిధంగా నిడమానూరు గ్రామంలోని రెడ్డి బజారులో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం చేతిలో ఉంచిన లడ్డూకు శుక్రవారం రాత్రి వేలం నిర్వహించారు. స్వామివారి పాదాల వద్ద ఉంచిన 41 కిలోల లడ్డూను శ్రీనివాసరెడ్డి రూ.లక్షన్నరకు పాడుకున్నారు. పూజా కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, పార్టీ ఎస్సీ సెల్ స్టేట్ కన్వీనర్ కొమ్మూరి కనకారావు, కంచర్ల సుధాకర్, పార్టీ గ్రామ అధ్యక్షుడు మాదాసు రాంబాబు, ఎంపీటీసీ తాటి అనురాధ, కొంజేటి సురేష్‌బాబు, పాదర్తి శివ, గండు వెంకట్రావు, వజ్రంబాబు, యాదాల నాగరాజు, తగిరిశ సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బీ నిడమానూరులో రూ.లక్షన్నరకు లడ్డూ దక్కించుకున్న శ్రీనివాసరెడ్డి



సంతనూతలపాడులో గణపతి ఊరేగింపులో ఉత్సాహంగా భక్తులు

సంతనూతలపాడులోని రెడ్డిగారిబజార్లో...

చీమకుర్తి రూరల్ (సంతనూతలపాడు): సంతనూతలపాడులోని రెడ్డిగారిబజార్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద చివరి రోజు సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భరతనాట్యం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానంలో సుమారు 2 వేల మందికిపైగా భక్తులు పాల్గొన్నారు. శనివారం వినాయకుడి ఊరేగింపు నిర్వహించి ఆదివారం కొత్తపట్నం సముద్రతీరంలో నిమజ్జనం చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సంతనూతలపాడు ఆర్యవైశ్య కళ్యాణ మండపం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయకునికి, పెద్ద బజారులోని సీతారాముల ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణనాథులకు శుక్రవారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించి స్థానిక ఎన్ఎస్పీ కాలువలో నిమజ్జనం చేశారు.

ఒంగోలులో విద్యా గణపతి అలంకరణ...

ఒంగోలు మెట్రో: స్థానిక రాజాపానగల్ రోడ్డు నాలుగో లైన్లో గణపతి నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గణనాథుడిని పుస్తకాలు, పెన్నులు, పలకలతో విద్యా గణపతిగా అలంకరించి పూజలు చేశారు.



ఒంగోలు రాజాపానగల్ రోడ్డులో పుస్తకాలు, పెన్నుల అలంకరణలో వినాయకుడు

పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ఒంగోలు టౌన్: పరిపాలనలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం ఒంగోలు నగరంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సీఐటీయూ 13వ నగర మహాసభ నిర్వహించారు. ఈ సభకు రత్నకుమారి, జి.రమేష్, సీహెచ్ రాంబాబు అధ్యక్షత వహించగా, ఉమామహేశ్వరరావు ప్రసంగిస్తూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత 11 ఏళ్లుగా ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తోందని ధ్వజమెత్తారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా దేశ ప్రజలలో విభేదాలు సృష్టించి పరిపాలన చేస్తోందని చెప్పారు. దేశ ప్రజలను కలిపి ఉంచే రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలని ప్రయత్నిస్తున్న బీజేపీ పచ్చి కార్మిక, కర్షక వ్యతిరేక పాలనతో కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. 29 కార్మిక చట్టాలను తొలగించి 4 లేబర్ కోడ్లు తీసుకొచ్చిందని, కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో సీఐటీయూ కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు, కర్షకులతో భవిష్యత్తులో ఐక్య పోరాటాలు నిర్మించనున్నట్లు ప్రకటించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ అసంఘటిత రంగాలకు చెందిన కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు కావడం లేదన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, సమాన వేతనాలు అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని చెప్పారు. సభలో కేవీ సుబ్బమ్మ, టి.విజయమ్మ ఎండీ యాసిన్, టి.మహేష్, తంబి శ్రీనివాసరావు, బీవీ రావు, వెంకటరావు, హరిబాబు, జగన్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో సమస్యలు పరిష్కరించండి

చీమకుర్తి: పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అణగారిన కులాల ఐక్యవేదిక జేఏసీ నాయకులు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే విజయ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. జేఏసీ నాయకులు పేరం శ్రీనివాసరావు, బండ్ల కొండలరావు, అత్యాల దావీదు, షేక్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, రామతీర్థం రిజర్వాయర్ నుంచి చీమకుర్తి పట్టణ వాసులకు తాగునీరివ్వాలని, పట్టణ వాసులకు పబ్లిక్ పార్కు నిర్మించాలని, ఇంకా తదితర సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు.